RNI NO : TELTEL/2023/86487

క్విక్ టుడే

QUICK TODAY

మంగళవారం 24 సెప్టెంబర్ 2024

quicktodaynews.com

9

# పీర్జాదిగూడలో పడకేసిన పారిశుద్ధ్యం

## ఏడాది కాలంగా శానిటరీ ఇన్‌స్పెక్టర్ అధికారి లేని వైనం

## అదనపు బాధ్యతతో పని భారంటున్న మున్సిపల్ సిబ్బంది

## ప్రజారోగ్యాన్ని పట్టించుకోని మున్సిపల్ అధికారులు

## అలంకారప్రాయంగా మారిన పాలకమండలి పనితీరు

*పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ అధికారి ఏడాదికాలంగా లేకపోవడంతో పారిశుధ్యం పడకేసింది. రెస్టారెంట్లు, హెూటల్స్, ఆసుపత్రులు మరియు పబ్లిక్ భవనాలు, ప్రజా సౌకర్యాలు వంటి ప్రదేశాల్లో పరిశుభ్రత పారిశుద్ధ్య ప్రమాణాలను నిర్వహించేలా శానిటరీ ఇన్స్పెక్టర్ బాధ్యత వహిస్తారు. పరిపాలన ఒక ఎత్తు అయితే - అందులో ప్రజారోగ్యం అత్యంత కీలకం. వ్యాధుల వ్యాప్తి నివారించడానికి మరియు ప్రజారోగ్యం మరియు భద్రతను చర్యలు అవగాహన కార్యక్రమాలు శానిటరీ ఇన్స్పెక్టర్ పూర్తి అవగాహనతో పని చేయవలసిన అవసరం ఉంటుంది. అలాంటి బాధ్యతగల పోస్ట్ లో శానిటరీ ఇన్స్పెక్టర్ అధికారి లేకపోవడం ప్రజారోగ్యం పట్ల మున్సిపల్ అధికారుల బాధ్యత రాహిత్యం అవుతుంది.*





పీర్జాదిగూడ, సెప్టెంబర్ 23 (క్విక్ టుడే న్యూస్) : పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పలు కాలనీల్లో పారిశుద్ధ్య నిర్వహణ సరిగ్గా లేక , వర్షాకాలం వల్ల భారీ వర్షాలు కురవడంతో డ్రైనేజీలు పొంగిపొర్లి రోడ్లపై ప్రవహిస్తూ లోతట్టు ప్రాంతాల్లోని కాలనీలోని ఇళ్లను ముంచెత్తుతున్నాయి. కొన్ని కాలనీలో వ్యర్థాలు ఒకే దగ్గర చేరి, చెట్లు పొదలుగా ఏర్పడి సరియైన పారిశుద్ధ్య నిర్వహణ లేక దోమలు స్వైర విహారం చేస్తూ ప్రజలు దోమలకాటు బారిన బడి డెంగ్యూ మలేరియా టైఫాయిడ్ వంటి జబ్బులతో ఆస్పత్రుల పాలవుతున్నారని,ఇది పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ లో అధికారుల వైఫల్యమేనని, పారిశుద్ధ్య నిర్వహణ, పనితీరు పట్ల ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. కార్పొరేషన్ లోని ప్రజల సమస్యలను తీర్చవలసిన పాలకమండలి అలంకారప్రాయంగా మారిందని, పారిశుద్ధ్యం ప్రజారోగ్యం పట్ల చర్యలుఅవగాహన కార్యక్రమాలు కల్పించే శానిటరీ ఇన్స్పెక్టర్ అధికారి గత ఏడాదిగా లేకపోవడంతో అదనపు బాధ్యతలు తీసుకుంటున్న ఇతర శాఖ అధికారులు పారిశుద్ధ్య నిర్వహణ, చర్యల పట్ల పూర్తిస్థాయిలో న్యాయం చేయలేకపోతున్నారని, ఇది అదనపు భారమే అవుతుందని మున్సిపల్ కార్పొరేషన్ లో శానిటరీ ఇన్స్పెక్టర్ అధికారి అత్యంత కీలకమని, దీనిపై పాలకమండలి, మున్సిపల్ కమిషనర్ దృష్టి సారించి శానిటరీ ఇన్స్పెక్టర్ అధికారి పోస్టింగ్ కు జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలని ప్రజలు కోరుతున్నారు.

### గ్రామపంచాయతీ పాలనే బాగుండేది : పాలకుర్తి శేషగిరిరావు

మేడిపల్లి గ్రామపంచాయతీ గా ఉన్నప్పుడు పారిశుద్ధ్యము డ్రైనేజీ రోడ్లు ప్రజారోగ్యం, ప్రజా సమస్యల పట్ల బాధ్యతగా వ్యవహరించే వారిని, పీర్జాదిగూడ కార్పొరేషన్ గా ఏర్పడ్డాక మున్సిపల్ కార్పొరేషన్ లో సిబ్బంది పెరిగిన ప్రజా సమస్యల పట్ల ప్రజా ప్రతినిధులు గాని మున్సిపల్ అధికారులు కానీ శ్రద్ధ వహించడం లేదని అన్నారు. భారీగా కురుస్తున్న వర్షాలతో డ్రైనేజీలు పొంగి వర్షపు నీటితో రోడ్లపై ప్రవహిస్తూ లోతట్టు ప్రాంతాల్లో వ్యర్థాలు చేరడంతో పాటు చెట్లు పొదలుగా ఏర్పడి దోమలు అధికమై పారిశుద్ధ్య నిర్వహణ సరిగా లేకపోవడం, బ్లీచింగ్ పౌడర్ చల్లడం, దోమల నివారణకు ఫాగింగ్ చేయకపో చేయడం వంటి చర్యలు చేపట్టకపోవడం మున్సిపల్ అధికారుల బాధ్యతా రాహిత్యం అన్నారు. పారిశుద్ధ్య నిర్వహణ- ప్రజారోగ్యం పట్ల బాధ్యతలు తీసుకునే శానిటరీ ఇన్స్పెక్టర్ లేకపోవడం బాధాకరం.



---

### అమృతం టెండర్లపై

## కేటీఆర్ అడ్డగోలు విమర్శలు

### మండిపడ్డ ఎంపీ మల్లు రవి

**హైదరాబాద్, సెప్టెంబర్23 (క్విక్ టుడే న్యూస్):** అమృత్ పథకం టెండర్ల విషయంలో మాజీ మంత్రి కేటీఆర్ నిరాధార ఆరోపణలు చేస్తున్నారని కాంగ్రెస్ ఎంపీ మల్లు రవి ధ్వజమెత్తారు. సృజన్‌రెడ్డి సీఎం రేవంత్ రెడ్డి సతీమణికి సొంత తమ్ముడు కాదని, బాబాయ్ కొడుకు అవుతాడని, ఈ విషయంలో కేటీఆర్ తప్పుడు ప్రచారం చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వ నిధులతో ఆన్‌లైన్‌లో టెండర్లు వేసిన అమృత్ పథకంలో ఆయన.. తన కంపెనీకి జాయింట్ వెంచర్‌లో కాంట్రాక్టు పొందారని, అక్కడ అక్రమాలకు తావులేదని మల్లు రవి తెలిపారు. భాజపా ప్రభుత్వం ఉన్న కేంద్రంలో టెండర్లలో సీఎంకు ఎలాంటి సంబంధం లేదనే విషయం ఆలోచించకుండా కేటీఆర్ బురద జల్లే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. సీఎం రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజల్లో వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక ఇలా తప్పుడు ఆరోపణలు చేస్తున్నారన్నారు. భారాస పదేళ్లలో చేయలేని పనులు సీఎం రేవంత్‌రెడ్డి పది నెలల కాలంలో చేస్తుంటే ఇలాంటి నిరాధార ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. భారాస ప్రతిపక్షంగా పనిచేయాలని విజ్ఞప్తి చేస్తున్నానని, లేకపోతే రానున్న ఎన్నికల్లో ప్రతిపక్ష హోదా కూడా లేకుండాపోతుందని హితవు పలికారు.

### అమృత్‌లో అవినీతిపై

## సీవీసీ విచారణ అవసరం

### కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్



**హైదరాబాద్, సెప్టెంబర్23 (క్విక్ టుడే న్యూస్):** ప్రజల దృష్టి మరల్చేందుకే కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు డ్రామాలాడుతున్నాయని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ మండిపడ్డారు. అమృత్‌లో జరిగిన అవినీతి బయటకు రావాలంటే సీవీసీ విచారణను కోరాలని డిమాండ్ చేశారు. దేశంలోని పట్టణాల్లో మౌలిక వసతులు మెరుగుపర్చే ఒక సదుద్దేశంతో కేంద్ర ప్రభుత్వం అమృత్ పథకాన్ని ప్రవేశపెడితే గత బీఆర్ఎస్, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వాలు పెద్దఎత్తున అవినీతికి పాల్పడుతూ ఈ పథకం ప్రయోజనాలు ప్రజలకు అందకుండా చేస్తున్నాయని విమర్శలు చేశారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఈ పథకంలో పెద్దఎత్తున అవినీతికి పాల్పడి తమకు కావాల్సిన వాళ్లకే కాంట్రాక్టులు కట్టబెట్టిందని బీఆర్ఎస్ ఆరోపిస్తుంటే, గత బీఆర్ఎస్ ప్రభుత్వమే అవినీతికి పాల్పడిందని కాంగ్రెస్ ప్రత్యారోపణలు చేయడం దొందుదొందే అన్న విధంగా ఉందన్నారు. కాంగ్రెస్ 6 గ్యారంటీల అమలులో వైఫల్యాలపై ప్రజల దృష్టి మళ్లించేందుకు వీరిరువురూ సవాళ్లు, ప్రతిసవాళ్లు చేసుకుంటూ డ్రామా చేస్తున్నారని దుయ్యబట్టారు. అమృత్‌లో ఎలాంటి అవినీతి జరగలేదని, కాంట్రాక్టు కట్టబెట్టడంలో పక్షపాతం చూపలేదని కాంగ్రెస్ ప్రభుత్వం భావిస్తే తక్షణమే సీవీసీకి లేఖ రాయాలన్నారు. లేకుంటే కాంగ్రెస్ ప్రభుత్వం అవినీతికి పాల్పడినట్టు భావించాల్సి వస్తుందని అన్నారు. సీవీసీ లేఖ రాస్తే దీనిపై విచారణ జరిపేందుకు సీవీసీని ఒప్పించేలా నేనే వ్యక్తిగతంగా చొరవ చూపుతానని తెలిపారు.

---

# ఖమ్మంలో పంటలు ఎండుతున్న కానరాదా?

### కృష్ణాలో నీళ్లున్నా.. ఎందుకు ఇవ్వడం లేదు

### గండ్లు పూడ్చడంలో నిర్లక్ష్యం ఎందుకు

### ముగ్గురు మంత్రులు ఉన్నా ఫలితం లేదు

### మాజీమంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు




**హైదరాబాద్, సెప్టెంబర్23 (క్విక్ టుడే న్యూస్):** ఉమ్మడి ఖమ్మం జిల్లాల్లో పంటలు దెబ్బతింటున్నా, ఎండిపోతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆరోపించారు. ఖమ్మం జిల్లాలో ప్రభుత్వ వైఫల్యం వల్ల ఎండిపోతున్న పంట పొలాలపై మాజీ మంత్రి హరీష్ రావు తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. తలాపున సముద్రం ఉన్న చేప పిల్లలు నీటికి ఏడ్చినట్టు ఉందని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని హరీశ్‌రావు విమర్శించారు. ఖమ్మం జిల్లాలో పంటలు ఎండిపోతున్నాయి. 22 రోజులైన కాల్వకు గండి పూడ్చడం చేతకాగ.. రైతుల పొలాలను కాంగ్రెస్ ప్రభుత్వం ఎండపెడుతుందన్నారు. పాలేరు, ఖమ్మం, వైరా, సత్తుపల్లి, మధిర నియోజకవర్గాల్లోని రైతులు ఎన్ఎస్పీ ఆఫీసులను ముట్టడి స్తున్నారు. పార్టీలకతీతంగా ధర్నా చేస్తున్న ప్రభుత్వం నిద్రపోతున్నదని హరీశ్‌రావు ధ్వజమెత్తారు. 9 మంది ఎమ్మెల్యేలను గెలిపిస్తే.. 3 లక్షల ఎకరాల పంటలు ఎండబెడుతారా.. అని కాంగ్రెస్ సర్కార్‌పై హరీశ్‌రావు నిప్పులు చెరిగారు. ఒకవైపు కృష్ణా నది నిండు కుండలా ఉన్నప్పటికీ.. పంటలన్నీ ఎండిపోతున్నాయని తెలిపారు. కాంగ్రెస్ సర్కార్‌కు కూల్చివేతలు తప్ప పూడ్చివేతలు రావా.. అని హరీశ్‌రావు నిలదీశారు. గతేడాది నీరు లేక పంటలు ఎండిపోయాయి. మరి ఈ ఏడాది పుష్కలంగా వర్షాలు పడినా కూడా కాంగ్రెస్ ప్రభుత్వం చేతికాని తనం వల్ల లక్షల ఎకరాల్లో పంటలు ఎండిపోయాయని హరీశ్‌రావు తెలిపారు. మంత్రులు భట్టి విక్రమార్క, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, తుమ్మల నాగేశ్వర్ రావు గండి పడిన కాలువ పక్క నుంచే వెళ్తున్నారు. 22 రోజులైనా గండిపూడ్చాలని సోయిలేదా..ఆకాశాన్ని దించుతాం, సూర్యుడిని వంచుతాం అనే డైలాగులు కొడుతున్న రేవంత్ రెడ్డికి, జిల్లా మంత్రులకు కాల్వ గండి పూడ్చాడం చేతకాదా? అని నిలదీశారు. హైడ్రా పేరుతో పేదల ఇండ్లు కూలగొట్టడం వచ్చుగానీ.. రైతులకు నీరు ఇవ్వడం రాదా? కాంగ్రెస్‌కు రైతుల పట్ల జాలి, దయ లేదా..? అని నిలదీశారు.

# ఉత్తర తెలంగాణ వర ప్రదాయిని కాళేశ్వరం

### మాజీ ఎంపీ వినోద్ కుమార్ విమర్శలు



**కరీంనగర్, సెప్టెంబర్23 (క్విక్ టుడే న్యూస్):** ఉత్తర తెలంగాణ వర ప్రదాయిని కాళేశ్వరం ప్రాజెక్టుపై ఇష్టమొచ్చి నట్లు మాట్లాడుతున్న కాంగ్రెస్ ప్రజాప్రతినిధులపై మాజీ బీఆర్ఎస్ ఎంపీ వినోద్ కుమార్ మండిపడ్డారు. ఏదైనా మాట్లాడే ముందు.. అవగాహనతో మాట్లాడాలని వినోద్ కుమార్ కాంగ్రెస్ నేతలకు సూచించారు. కరీంనగర్‌లో కౌశిక్ రెడ్డి తదితరులతో కలసి ఆయన మీడియాతో మాట్లాడారు. కాళేశ్వరంపై కాంగ్రెస్ మంత్రులు, నాయకులు అవగాహనరాహిత్యంతో మాట్లాడుతున్నారని వినోద్ కుమార్ మండిపడ్డారు. కాళేశ్వరం అంటే మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ళ బ్యారేజీలే అన్న అవగాహనతోనే కాంగ్రెస్ నాయకులు ఉన్నారని పొన్నం ప్రభాకర్ మాటల్లో తెలుస్తున్నదని వినోద్ కుమార్ పేర్కొన్నారు. ఇంతకంటే అవగాహనారాహిత్యం మరొకటి ఉండదు. కాళేశ్వరంలో నిర్మించిన వందలాది కాంపోనెంట్స్‌లో ఈ మూడు బ్యారేజీలు కూడా ఉన్నాయి తప్ప అవే కాళేశ్వరం ప్రాజెక్టు కాదు. కాళేశ్వరం స్వరూపాన్ని పొన్నం ప్రభాకర్‌కు, అతని సహచరులకు మరొక్కసారి వివరించాల్సిన అవసరం ఉన్నదని వినోద్ కుమార్ తెలిపారు.బ్యారేజీలు, జలాశయాలు, గ్రావిటి కాలువలు, పైప్ లైన్లు, సొరంగాలు, భూగర్భ పంప్ హౌజ్ లు, సర్జ్ పూల్స్, విద్యుత్ సబ్ స్టేషన్లు, విద్యుత్ లైన్లు.. ఇవన్నీ కలిపితే ఒక ప్రాజెక్టు తయారవుతుందని వినోద్ కుమార్ స్పష్టం చేశారు. ఈ ప్రాజెక్టు ప్రయోజనాలు 20 జిల్లాల్లో విస్తరించి ఉండడం, కొత్త ఆయకట్టు, స్థిరీకరణ కలుపుకొని మొత్తం 45 లక్షల ఎకరాలకు సాగునీరు అందించడం లక్ష్యమన్నారు. తాగునీటి అవసరాల కోసం 40 టీఎంసీలు, పారిశ్రామిక అవసరాల కోసం 16 టీఎంసీలు సరఫరా చేసే విధంగా ప్రాజెక్టుల రూపకల్పన జరిగిందన్నారు. కాంగ్రెస్ హయాంలో ప్రతిపాదించిన ప్రాణహిత, చేవెళ్ల ప్రాజెక్టులో మొత్తం నీటి నిల్వ సామర్థ్యం 14 టీఎంసీలు మాత్రమే అని వినోద్ కుమార్ గుర్తు చేశారు.